మినీకథ

# కప్పు కాఫీ కోసం

సి.హెచ్. రమణ మూర్తి




మాఘమాసపు సంధ్యలో నీరెండ ఒంటికి వెచ్చగా, జవరాలి నులివెచ్చని కౌగిలిలా తగులుతూండగా హౌరా స్టేషన్లో దిగేను.

ఉద్యోగ రీత్యా ఢిల్లీ వెళ్ళవలసి వచ్చింది. హౌరా నుంచి ఢిల్లీకి అమృత్‌సర్ మెయిల్లో ఫస్ట్‌క్లాస్ రిజర్వేషనుకి కబురు పంపేను. అది ఖాయం చేసుకునేందుకు కౌంటర్‌లో వాకబు చేయగా ఖాయ మైనట్లు తెలిసింది.

అమ్మయ్య! అని తేలికగా ఊపిరి పీల్చుకుని వీలర్ బుక్ స్టాల్‌లో వారపత్రికలు కొని ఇటూ అటూ తిరుగుతూ కాలక్షేపం చేసేను. అమృతసర్ మెయిలు రాత్రి ఎనిమిదో గంటకి తొమ్మిదో నెంబరు ప్లాట్‌ఫారం చేరింది. రిజర్వేషను లిస్టులో బోగీ నెంబరూ, బెర్తు నెంబరూ చూసి ఫస్ట్‌క్లాస్ కంపార్ట్‌మెంటులోకి ప్రవేశించాను. 'ఏ' కూపేలో లోయర్ బెర్త్-'వెరీగుడ్' అనుకుని నా సూట్‌కేస్, చిన్న బెడ్డింగ్, బెర్త్‌పై పడేసి మహానందంగా కిటికీ ప్రక్క చేరి పత్రిక తిరగేయసాగాను. 'ఆంధ్రజ్యోతి' అన్నా, వా.సో.గారి కథలన్నా నాకిష్టం. బాపు-బాలి బొమ్మలు మరీ ఇష్టం! ఆ ఆనందం జ్రురుకుంటుండగా-

ఆజానుబాహువూ-ఆరడుగుల మనిషీ తెల్లటి పొడుగాటి గెడ్డంతో ప్రత్యక్షమయేడు కూపేలో. అతడూ ఢిల్లీ వస్తున్నాడట. అక్కడి నుండి గల్ఫ్ దేశాలకు వెళ్తాడట. తనకు ఆరోగ్యం బాగులేదని క్రింది బెర్తు ఇమ్మన్నాడు. నేను సరేనని నా బిఛాణా మీదకు మార్చి వారపత్రికలో బాలి రేఖాచిత్రాల అందాలు చూస్తూ చదువులో పడ్డాను. ఎప్పుడో నిద్ర లోకి జారుకున్నాను.

మెలకువ వచ్చేసరికి బాగా తెల్లారింది. ఆకాశంలో మేఘాలు క్రమ్ముకుని ఉన్నాయి. చిన్న తుంపర పడుతూంది. ముసురు పట్టే నట్లుంది. పేస్టూ, బ్రష్ తీసుకుని ఆ చేత్తోనే 'పొది' కూడా పట్టుకుని టాయిలెట్‌లోకి వెళ్ళేను. బయటపడి చూసేసరికి అలహాబాదు స్టేషను వచ్చింది. ఆదరా బాదరాగా ఆ లుంగీ హవాయి చెప్పులతోనే పైన బుష్ షర్ట్ వేసుకుని పర్సులోంచి రెండ్రూపాయల కాగితం జేబులో కుక్కి ప్లాట్‌ఫారం మీదికి పరుగుతీశాను కాఫీ కోసం!

ఎదురుగానే రెస్టారెంట్ కన్పించేసరికి లోనికి వెళ్ళి ఒక కప్పు స్ట్రాంగ్ కాఫీని ఆర్డరిచ్చేను. అప్పటి దాకా జీవుడు కాఫీ కోసం తహతహలాడి పోతున్నాడు. కాఫీ గత ప్రాణి కదా!

కాఫీ త్రాగగానే బేరర్ చేతిలో రెండు రూపాయిల కాగితం పెట్టి బిల్లు కోసం ఎదురు చూడకుండా బైట కొచ్చి చూస్తే ఏముంది? ప్లాట్ ఫారం ఖాళీగా వుంది. నా కళ్ళు పచ్చబారేయి. నే నెక్కడున్నాను? కళ్ళు తిరుగు తూన్నట్లయింది. ఇది మరో ప్లాట్ ఫారమా?

అటూ-ఇటూ చూసేను. చిత చితలాడుతూ వర్షం. అలా పోతూన్న ఒక వ్యక్తిని పిలిచి అమృత్‌సర్ మెయిల్ ఎక్కడుందని అడిగే సరికి అతడు నవ్వుతూ "ఇంకెక్కడి మెయిలు సార్! ఎప్పుడో వెళ్ళిపోయింది" అన్నాడు హిందీలో. నా కళ్ళు బైర్లు కమ్మేయి.

ఇక నా అవస్థ వర్ణనాతీతం. నా ఆఫీసు ఫైలూ, రైల్వేపాసూ, సామ్మూ అన్నీ రైల్లోనే వుండిపోయాయి. నా సూట్ కేసు తెరిచి చిందర వందరగానే వదిలేశాను. నా బెడ్డింగ్ సరేసరి. నా బూట్లు కూడ బెర్తు క్రింద వదిలేశాను. రాత్రి వేసుకున్న లుంగీ, పైన పోలిస్టరు షర్టు, కాళ్ళకు హవాయి చెప్పులు తప్ప ఇంకేమీ లేవు. ఇంకేది దారిరా భగవంతుడా అనుకున్నాను. ఇక ఆ ఏడుకొండలవాడే గతి. ఒక మూల వర్షపు జల్లు, చలిగాలి గజ గజలాడిస్తూంది. నా సమస్తం మెయిలార్పణం చేసి ఇలా ఒంటరిగా ఊరుకాని ఊరు, ప్రాంతం కాని ప్రాంతం, చేతిలో చిల్లిగవ్వలేకుండా టిక్కెట్టయినా లేక (పాసు కూడా లేక) దిక్కులేనివాడిలా అలహాబాదు ప్లాటుఫారం మీద నిల్చున్న నాకు కడుపులో కాఫీ దేవినట్లయింది. దిక్కుమాలిన కాఫీ! ఇదే నాకొంప ముంచింది. అని తిట్టుకున్నాను.

అలపిస్తే లాభం లేదని జనరల్ ఎ.ఎస్.ఎమ్ రూమ్‌కి వెళ్లి నా గోడు విన్పించుకుని 'నీవే తప్ప ఇతఃపరం బెరుగ' అని వేడుకున్నాను. మెయిలు తరువాతి స్టాప్ చేరేలోగా అక్కడి స్టేషనుకు ఫోను చేయమన్నాను. కొంత వెట కారం, వేళాకోళం మిలాయించినా అతడు ఫోను చేసేడు. లైను దొరకక కొంత సేపు ఇబ్బంది అయింది. నాకు ముక్కోటి దేవతలూ కన్పించ సాగేరు. నా కంపార్ట్ మెంట్ నెంబరూ, కూపే నెంబరూ, నా లగేజీ వివరాలూ చెప్పి ఫోను చేయించేను ఫతేపూర్‌కి.

విద్యార్థుల ఆందోళన మూలంగా మెయిలు త్రోవలో ఒక గంట పైగా ఆపేసేరట. అందుచే ఇంకా ప్రక్క హాల్ట్‌కి చేరలేదని జవాబు. అన్ని వివరాలు చెప్పి లగేజీని ప్రక్క స్టేషనులో దింపించవలసిందిగా ఫోను చేయించాను. అక్కడి వాళ్ళు ఏ కళను ఉన్నారో మెయిలు రాగానే జి.ఆర్.పి.ని వెంటబెట్టుకుని సామాన్లు దింపించి తిరుగు వర్తమానం చెప్పేరు.

అది వింటూనే ఏడు కొండలవాడికి దండం పెట్టుకున్నాను. ఆపద మ్రొక్కులవాడు కదా ఆ మాత్రం సహాయం చేయ్యడా!

ఆ స్టేషన్ మాస్టరుకు థాంక్స్ చెప్పి ఆ తరువాతి ట్రైన్‌లో ఫతేపూర్ చేరుకున్నాను. అప్పటికి మధ్యాహ్నం మూడయింది. అక్కడి ఎస్.ఎమ్.ని కలిసి జి.ఆర్.పి. వాళ్ళ వద్ద భద్రపరచిన సామాన్లు నా బూటుతో సహా తీసుకుని వాళ్ళకి కృతజ్ఞతలు తెలిపి (ఇరవై రూపాయిలతో) ఆ సాయంత్రం వచ్చిన ఢిల్లీ ఎక్స్‌ప్రెస్‌లో తిరిగి ఢిల్లీ వైపు ప్రయాణం సాగించేను.

ఇదండీ కప్పు కాఫీ పెట్టిన తిప్పలు! ఎన్నడైనా మరువగలనా ?